సాక్షి
ఖమ్మం

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



హైవే అభివృద్ధికి నిధులు

ఖమ్మం - కురవి జాతీయ రహదారి అభివృద్ధికి రూ.124కోట్లు మంజూరయ్యాయని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. 10లో



వైరా నుంచి బరిలో నిలుస్తాం

వచ్చే ఎన్నికల్లో వైరా నుంచి సీపీఐ అభ్యర్థి బరిలో ఉంటారని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హేమంతరావు వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
43° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున కాస్త చల్లగా ఉంటుంది. ఆ తర్వాత ఎండ మొదలై మధ్యాహ్నం గరిష్టస్థాయికి చేరుతుంది.



ఆదిలోనే హంసపాదు

డోర్నకల్ - మిర్యాలగూడ రైల్వేలైన్ సర్వే అడ్డగింత

- పంట పొలాలు, ఇళ్ల మీదుగా సర్వే చేపడుతుండడంతో ఆగ్రహం
- భూములు ఇచ్చేది లేదని చెబుతున్న రైతాంగం
- ఇప్పటికే హైవేల నిర్మాణానికి కోల్పోయామని ఆవేదన
- రూ.కోట్ల విలువైన భూమికి రూ.లక్షల్లో పరిహారం సరిపోదని వెల్లడి

ఖమ్మంరూరల్: ఈ ప్రాంత రైతాంగం ఇప్పటికే జాతీయ రహదారుల కోసం వందల ఎకరాలు ఇచ్చారు. ఆ షాక్ నుండి కోలుకోకముందే మరికొందరు రైతుల భూములు, ఇళ్ల మీదుగా ప్రతిపాదిత రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే జరుగుతుండడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుండి నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం వరకు నిర్మించ తలపెట్టిన కొత్త రైల్వేలైన్ కోసం ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా సర్వే చేస్తుండడం ప్రజలు, రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో కొద్దిరోజుల నుంచి భూసేకరణకు సర్వే చేస్తుండగా.. పలు ప్రాంతాల్లో స్థానికులు వారిని అడ్డుకుని వెనక్కి పంపుతున్నారు. రూ.కోట్ల విలువైన భూములను జాతీయ రహదారుల కోసం ఇచ్చిన తాము మిగిలిన కొద్దిపాటి భూమిని కూడా అరకొర పరిహారంతో రైల్వేలైన్‌కు ఇచ్చి రోడ్డున పడలేమని చెబుతున్నారు.

సర్వే అడ్డగింత

నేలకొండపల్లి మండలంలో గతంలోనే సర్వే పూర్తిచేయగా.. ఖమ్మం రూరల్ మండలంలో మొదలుపెట్టారు. దీంతో రైతులు, ప్రజలు, వివిధ పార్టీల నాయకులు ఎక్కడికక్కడ సిబ్బందిని అడ్డుకుంటున్నారు. ముత్తగూడెం, పల్లెగూడెంలో సర్వే సిబ్బందిని అడ్డుకుని వెనక్కి పంపించారు. ఏళ్లుగా భూములపై ఆధారపడి జీవిస్తున్న తాము భూములు ఇచ్చేది లేదని చెప్పి సర్వేను అడ్డుకుంటుండగా.. చేసేదేం లేక సిబ్బంది వెనక్కి వెళ్లిపోయారు. కానీ మళ్లీ ఎప్పుడు సర్వేకు వస్తారో తెలియక రైతులు, ప్రజలు కంటి మీద కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారు.

ఎకరం ధర రూ.3కోట్లకు పైగానే..

ఇంతకాలం తాము ఉంటున్న నివాసాలు, పంటలు పండించుకుంటున్న భూములను రైల్వేలైన్ కోసం సేకరిస్తారన్న ప్రచారంతో రైతులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఖమ్మం రూరల్ మండలం ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో ఇక్కడి భూములు ఎకరాకు రూ.3కోట్లనుండి రూ.4 కోట్ల వరకు ధర పలుతోంది. కానీ ప్రభుత్వం భూమి సేకరించినా ఎకరాకు కేవలం రూ.30లక్షలకు మించి ఇవ్వకపోవచ్చని సమాచారం. దీంతో భూసేకరణకు అంగీకరించబోమని వారు స్పష్టం చేస్తున్నారు. ఏదులాపురం, పెదతండాలను తొలుత ఖమ్మం కార్పొరేషన్‌లో కలపగా.. మళ్లీ గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేశారు. భవిష్యత్‌లో కార్పొరేషన్‌లో కలిసే అవకాశముండగా, ఇప్పటికే రూ.కోట్లు పలుకుతున్న భూముల విలువ మరింత పెరిగే అవకాశముంది. దీంతో రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పించాలని ఇటీవల రైతులు ఎంపీ నామా నాగేశ్వరరావుకు విన్నవించగా ఆయన కేంద్ర రేల్వే మంత్రికి లేఖ రాస్తానని హామీ ఇచ్చారు.

జాతీయ రహదారులకు 600 ఎకరాలు

ఖమ్మం రూరల్ మండలం మీదుగా ఇప్పటికే పలు జాతీయ రహదారుల నిర్మాణానికి 600 ఎకరాల వరకు భూములు సేకరించారు. కోదాడ - కురవి జాతీయ రహదారికి 226 ఎకరాలు, ఖమ్మం - సూర్యాపేట రహదారి కోసం 60 ఎకరాలు, ఖమ్మం - దేవరపల్లి రహదారికి 190 ఎకరాలు, నాగపూర్-అమరావతి రహదారికి 67 ఎకరాల మేర భూములను రైతులు కోల్పోయారు. రహదారుల నిర్మాణానికి తోడు రియల్టర్ల మాయాజాలంతో రెండు పంటలు పండే భూములు ఇప్పుడు కళ కోల్పోయాయి. ఇక మిగిలిన కొద్దిపాటి భూములను కూడా రైల్వేలైన్ కోసం సేకరిస్తే భవిష్యత్‌లో తమ పరిస్థితి ఏమిటన్నది స్థానికుల వాదన. పైగా రూ.కోట్ల విలువైన భూమికి తక్కువ పరిహారం అందనుండడంతో వారి మనస్సు ఒప్పుకోవడం లేదు.



నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం వద్ద సర్వే చేస్తున్న ఏజెన్సీ సిబ్బంది (ఫైల్)





డోర్నకల్ నుంచి మిర్యాలగూడ.. వయా ఖమ్మం

ప్రజలతో పాటు సరుకు రవాణా అవసరాల కోసం రైల్వేశాఖ కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి ప్రతిపాదించింది. ఈ లైన్ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుండి ఖమ్మం జిల్లాలోని మల్లెమడుగు రైల్వేస్టేషన్ మీదుగా ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం, ముత్తగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లితో పాటు ముదిగొండ, నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, బోదులబండ, రామచంద్రాపురం, పైనంపల్లి తదితర ప్రాంతాల మీదుగా సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం వరకు నిర్మించాలనేది లక్ష్యం. ఇప్పటికే గూగుల్ మ్యాప్ ద్వారా ప్రతిపాదిత మార్గాన్ని రూపొందించి సర్వే చేపట్టారు. ఈ లైన్ నిర్మాణానికి ఒక్క ఖమ్మం రూరల్ మండలంలోనే దాదాపు 800 ఎకరాల మేర భూమి సేకరించనున్నట్లు అంచనా.

న్యూస్‌రీల్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఏ.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్షలు జరగనుండగా, పది కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకునేలా అవగాహన కల్పించడంతో పాటు వేసవి దృష్ట్యా తాగునీరు, వైద్యశిబిరాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అలాగే, మాస్ కాపీయింగ్, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ప్రశ్నపత్రాల భద్రతతో పాటు సమాధాన పత్రాలను పంపించే సమయాన జాగ్రత్తవహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో డీఎంహెచ్ఓ మాలతదితో పాటు డీఈఓ కార్యాలయం ఏడీ ఎం.వీ.చారి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 24న జిల్లాకు మంత్రి హరీశ్‌రావు

ఖమ్మం వైద్యవిభాగం: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈనెల 24వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో రేడియాలజీ విభాగం, కీమోథెరపీ యూనిట్‌ను ప్రారంభించనున్న ఆయన న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేస్తారని సమాచారం. అలాగే, రంగనాయకుల గుట్ట వద్ద ఏర్పాటుచేసిన బస్తీ దవాఖానాను ప్రారంభించాక, కల్లూరులో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిసింది.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

విజయ డెయిరీ డీడీ కుమారస్వామి



డీడీకి వినతిపత్రం ఇస్తున్న పాల ఉత్పత్తిదారులు

ఖమ్మంవ్యవసాయం: పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునిస్తోందని ఖమ్మం జిల్లా పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ) డిప్యూటీ డైరెక్టర్ ఏ.కుమారస్వామి తెలిపారు. ఖమ్మంలోని డెయిరీలో సోమవారం ఆయన పాల ఉత్పత్తిదారులతో సమావేశమయ్యారు. ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా డెయిరీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం విజయ వివాహ కానుక ద్వారా ముగ్గురు రైతులకు రూ.15 వేలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా పశుగాణాభివృద్ధి సంస్థ చైర్మన్ కొర్లకుంట నాగేశ్వరరావు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బోజెడ్ల వెంకటయ్య, డెయిరీ మేనేజర్ ఎస్.సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత మూడేళ్లుగా బకాయి ఉన్న లీటర్‌కు రూ.4 ప్రోత్సాహకాన్ని వెంటనే చెల్లించడమే కాక పాడి పరిశ్రమను రక్షించాలనే డిమాండ్‌తో పాల ఉత్పత్తిదారులు డీడీ కార్యాలయం ఎదుట కాసేపు నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు.

20న ప్రభుత్వం తరఫున ఇఫ్తార్

ఖమ్మంమయూరిసెంటర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం తరఫున ఈ నెల 20న ఖమ్మంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, హోంమంత్రి మహమూద్ అలీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈనెల 20న సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక ప్రార్థన అనంతరం ఇఫ్తార్ విందు ఉంటుందని తెలిపారు.

రెండు వేల మందికి 'డబుల్' ఇళ్లు



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ తదితరులు

- రూ.120కోట్లతో ఖమ్మం నియోజకవర్గంలో నిర్మాణం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ
- కేసీఆర్ టవర్స్‌లో 263మందికి ఇంటి పట్టాలు పంపిణీ

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ఏర్పడ్డాక ఒక్క ఖమ్మం నియోజకవర్గంలోనే రూ.120 కోట్ల వ్యయంతో రెండువేల మందికి పైగా పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి పంపిణీ చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లి సమీపంలోని కేసీఆర్ టవర్స్‌లో 263 మంది పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 'డబుల్' ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని చెప్పారు. మొదటి విడతలో వేయి మందికి పట్టాలు ఇవ్వగా, ఇప్పుడు రెండో విడత పంపిణీ చేసినట్లు తెలిపారు. నగరం నడిబొడ్డున టేకులపల్లిలోని 11ఎకరాల్లో 1,250 ఇళ్లు నిర్మించగా అధునాతన అపార్ట్‌మెంట్‌ను తలదన్నేలా గేటెడ్ కమ్యూనిటీ నివాస సముదాయం సిద్ధమైందని వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు వెచ్చించడమే కాక విద్యుత్, అంతర్గత రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించి.. పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేశామని తెలిపారు. ఇంకా వైఎస్ఆర్ నగర్, మల్లెమడుగు, అల్లీపురంలో మరో 400 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి చెప్పారు. కాగా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ఆస్తిని కాపాడుకోవాలే తప్ప దుర్వినియోగం చేసుకోవద్దని పువ్వాడ సూచించారు. కాగా, పట్టాలు అందుకున్న లబ్ధిదా రులు హర్షం వ్యక్తం చేయగా.. వారి విజ్ఞప్తి మేరకు మంత్రి పువ్వాడ గ్రూప్ ఫొటో దిగి ఆనందంలో పాలుపంచుకున్నారు.

రూ.12కోట్లతో 172 రోడ్లు

'సుడా' నిధులు రూ.12కోట్లతో 172 ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడేలా రోడ్లు నిర్మించామని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం 10వ డివిజన్ చైతన్యనగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, చైతన్య నగర్ ఆర్చ్‌ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రజావసరాల మేరకు అవసరమైన అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ విజయ్, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు, తహసీల్దార్ శైలజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ రంగారావు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాపరంగా పరిష్కరించండి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు మధుసూదన్, స్నేహలత



వృద్ధురాలికి చేయూతనిస్తున్న కానిస్టేబుల్

- గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్
- బారులుదీరిన ఫిర్యాదుదారులు

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను ప్రాధాన్యతాపరంగా పరిశీలిస్తూ పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా పెద్దసంఖ్యలో ప్రజలు రాగా.. వారి నుంచి అదనపు కలెక్టర్లు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన వారు మాట్లాడుతూ జాప్యం లేకుండా ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో శిరీష, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- చింతకాని మండలం కొదుమూరుకు చెందిన శ్రీరామ శ్రీనాథ్ 2021న కరోనాతో మరణించినందున ప్రభుత్వం నుండి ఆర్థికసాయం అందించాలని ఆయన భార్య రమాదేవి కోరారు.
- ఖమ్మం దివ్యాంగుల కాలనీకి చెందిన దుంగ యల్లమ్మ కోడలు కరోనాతో చనిపోయిందని, కొడుకు మతిస్థిమితం కోల్పోయినందున ఇద్దరు పిల్లల పోషణకు ఆర్థిక సాయం అందించాలని విన్నవించారు.
- కల్లూరు మండలం యర్రబంజరకు చెందిన గుగులోతు రాములు గోకవరం రెవెన్యూలో ఖాతా నెం.738లో ఉన్న నాలుగెకరాల భూమిపై ఇతరులకు ఇచ్చిన పాస్‌పుస్తకం రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు.
- బోనకల్ మండలం రాపల్లికి చెందిన మన్నెపల్లి సత్యానారాయణ తన ఎకరం భూమి ప్రభుత్వ భూమిగా నమోదైందని న్యాయం చేయాలని కోరారు.
- సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామపంచాయతీ పరిధి సర్వే నంబర్ 34లోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు కేటాయించాలని సీపీఎం నాయకులు విన్నవించారు.
- నేలకొండపల్లి మండలం చెరువుమాధారం మత్స్యశాఖ సొసైటీకి సంబంధించి సభ్యులుగా తమను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకుని సభ్యత్వాలు పునరుద్ధరించాలని మంగాపురంతండా వాసులు భుక్యా రాములు, నాగేశ్వరరావు, భిక్షం తదితరులు వినతిపత్రం ఇచ్చారు.

నెలాఖరుకు రూ.పది కోట్లు లక్ష్యం

- 'ఎర్లీ బర్డ్'పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెలలో ఇంటి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ(ఎర్లీ బర్డ్) వర్తిస్తుందనే విషయమై ప్రజల్లో అవగాహన కల్పించి నెలాఖరుకు రూ.10 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది పని చేయాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కేఎంసీ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన పన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఇస్తున్న రాయితీని చెల్లింపుదారులకు వివరించాలన్నారు. ఈనెల 1వ తేదీ నుండి ఇప్పటి వరకు రూ.2.50 కోట్లు వసూలు చేయగా.. నెలాఖరులోగా రూ.7.50 కోట్లు వసూలు చేయాలని తెలిపారు. ఇందుకోసం 24 మంది ప్రత్యేక అధికారులను నియమించగా, వారు తమ పరిధి లోని బిల్లు కలెక్టర్లను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి, ఆర్ఓ జి.శ్రీనివాస్, ఈఈ కృష్ణాలాల్, డీఈలు రంగారావు, ధరణి, ఆర్ఐలు కె.శ్రీనివాస్, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రీవెన్స్ డేలో భాగంగా నగర ప్రజల నుండి కమిషనర్ ఆదర్శ్ సురభి ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి 42 ఫిర్యాదులు వచ్చి నట్లు అధికారులు తెలిపారు. కాగా, గ్రీవెన్స్‌కు కొన్ని విభాగాల అధికారులు రాకపోవడాన్ని గమనించిన కమిషనర్.. ఇక నుంచి అధికారులంతా హాజరుకావాలని ఆదేశించారు.

వ్యాక్సినేషన్ సెంటర్‌లో తనిఖీ



టీకా నిల్వలను పరిశీలిస్తున్న రమణ

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీలో వ్యాక్సినేషన్, వ్యాక్సిన్ నిల్వలను జిల్లా మేనేజర్ సీహెచ్.రమణ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడమే కాక టీకాలు వేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా మరిన్ని జాగ్రత్తలు వహించాలని తెలిపారు. వైద్యులు శ్రీదేవి, శాంతికుమారి, శారద తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకుల్లో ఏపీజీవీబీ అగ్రస్థానం

- రూ.52 వేల కోట్ల మేర వార్షిక టర్నోవర్
- బ్యాంక్ చైర్మన్ కొండూరు ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్, పక్కన జీఎంలు దయాకర్, అనిల్, విజయ్‌భాస్కర్ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: దేశంలోనే గ్రామీణ బ్యాంకుల పరంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ (ఏపీజీవీబీ) అగ్రగామిగా ఉందని బ్యాంక్ చైర్మన్ కొండూరు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని ఎన్ఎస్‌టీ రోడ్డులో నిర్మించిన బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ భవనాన్ని సోమవారం చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మొత్తం 43 గ్రామీణ బ్యాంకులు ఉండగా.. ఇందులో ఏపీజీవీబీ రూ. 52 వేల కోట్ల టర్నోవర్‌తో అగ్రభాగాన నిలుస్తోందని చెప్పారు. గడిచిన మూడేళ్లుగా లాభాల్లో ముందంజలో ఉందని వివరించారు. 2020-21లో రూ.1,011 కోట్లు 2021-22లో రూ.813 కోట్లు, 2022-23లో రూ. 1,046 కోట్ల లాభాలను ఆర్జించినట్లు తెలిపారు.ఇక రూ.11 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాలు ఇవ్వగా.. గృహరుణాలు రూ.4వేల కోట్లు, బంగారంపై రూ.3,400 కోట్ల మేర రుణాలు ఇచ్చామని చైర్మన్ ప్రవీణ్ కుమార్ వివరించారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

బ్యాంకులో సిబ్బంది కొరత ఉన్నా ఖాతాదారుల నమ్మకం, ఉద్యోగుల కృషి ఫలితంగా బ్యాంకు ప్రగతిపథంలో దూసుకుపోతోందని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వీ డూ కేవైసీ ద్వారా అత్యధికంగా బ్యాంకు ఖాతాలను తెరవగా, గ్రామాల్లో మొబైల్ ఏటీఎంల ద్వారా ఖాతాదారులకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను కూడా ప్రజలు బ్యాంకు ద్వారా వినియోగించుకుంటున్నారని, ఏపీజీవీబీ వడ్డీ రేట్లు వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఉన్నాయని చెప్పారు. గృహ నిర్మాణానికి గరిష్ఠంగా రూ.1.50 కోట్ల వరకు, విదేశీ విద్యారుణం రూ.కోటి వరకు ఇస్తున్నామని తెలిపారు. ఏపీజీవీబీకి తెలంగాణలో తొమ్మిది, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయని, ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం రూ.2,300 కోట్ల టర్నోవర్‌తో ఉండగా, 64 బ్రాంచ్‌లు కొనసాగుతున్నాయని చైర్మన్ వివరించారు. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్లు డి.దయాకర్, వి.అనిల్, ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం ఆర్ఎం బి.విజయ్‌భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'హెల్ప్ డెస్క్'తో మహిళలకు భరోసా

పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మంక్రైం: మహిళలకు భరోసా కల్పించేందుకు ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యాన ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఉమెన్స్ హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశారు. ఈ హెల్ప్ డెస్క్‌ను సీపీ విష్ణు ఎస్.వారియర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు మహిళలకు భరోసా కల్పించేలా ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బందితో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేశామని చెప్పారు. తాజాగా కమిషనరేట్‌లో ఏర్పాటు చేశామని వివరించారు. సమస్యలపై వచ్చే మహిళలతో గౌరవంగా మాట్లాడడం, వారి సమస్య విని పరిష్కారానికి కృషి చేసేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, ఏఓ అక్తరున్నీసాబేగం, సీఐ తుమ్మా గోపి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న సీపీ వారియర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా అథ్లెట్లకు పతకాలు



పతకాలు సాధించిన అథ్లెట్లతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: హనుమకొండ జేఎన్ఎస్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఫెడరేషన్ కప్‌లో జిల్లాకు చెందిన బాలబాలికల పతకాలు సాధించారు. పోటీల్లో ఎ.మైథిలి, బి.ఇందుప్రియ, పి.కామాక్షి, నాగమణి, వివేక్‌చంద్ర, ఎస్.కే.లాల్‌పాషా, దినేష్ కార్తీక్ వివిధ విభాగాల్లో పతకాలు సాధించగా, జిల్లాకు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కింది. ఈ సందర్భంగా క్రీడాకారులను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ సున్నా రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు ఎం.సుధాకర్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, హలీం, త్రివేణి తదితరులు సోమవారం అభినందించారు.

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామనాథం



రామనాథం

మధిర: మధిరకు చెందిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రెండోసారి నియమితులయ్యారు. పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న ఆయన మధిర నియోజకవర్గ పార్టీ కన్వీనర్‌గా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈమేరకు రెండోసారి ఆయనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక పత్రం జారీ చేశారని రామనాథం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: బాధితులు ఇచ్చే ఫిర్యాదులను పరిశీలించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సీపీ విష్ణు ఎస్.వారియర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా సీపీ పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఎక్కువగా భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత, సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలపై ఫిర్యాదులు అందగా విచారణ, పరిష్కారంపై అధికారులకు సీపీ సూచనలు చేశారు.

వాల్యాతండాలో తాగునీటి ఎద్దడి



గురువాయిగూడెం నుండి నీరు తెచ్చుకుంటున్న తండావాసులు

కూసుమంచి: మండలంలోని గురువాయిగూడెం గ్రామపంచాయతీ శివారు వాల్యాతండాలో తాగునీటికి స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తండాకు మిషన్ భగీరథ ప్రాజెక్టు నుండి సరఫరా అయ్యే నీరు నాలుగు రోజులుగా నిలిచిపోయింది. దీంతో సమీపంలోని గురువాయిగూడెం గ్రామానికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదికారులు స్పందించి తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

కాల్వలో ట్రాక్టర్ బోల్తా



అదుపుతప్పి కాల్వలో పల్టీ కొట్టిన ట్రాక్టర్

సత్తుపల్లిరూరల్: ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పాత ఎన్టీఆర్ కాల్వలో బోల్తా పడింది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన పాదిలి పెద్ద నాగేశ్వరరావు స్థానిక వేశ్యకాంతల చెరువు సమీపంలోని పొలం నుంచి ధాన్యాన్ని ట్రక్కులో తీసుకుని కాకర్లపల్లిలో కేంద్రం వద్దకు సోమవారం బయలుదేరాడు. ఎస్సీకాలనీ సమీపాన పాత ఎన్టీఆర్ కాల్వ మీదుగా వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ధాన్యం మొత్తం తడిసిపోగా ట్రాక్టర్ సీటుకింద చిక్కుకుపోయిన నాగేశ్వరావును స్థానికులు బయటకు తీశారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం

బోనకల్: మండలంలోని బోనకల్‌లో రైతు బండి వెంకటేశ్వర్లుకు చెందిన మొక్కజొన్న చేనుకు సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా దగ్ధమైంది. రైతు చేనులోని ట్రాన్స్‌ఫార్మర్ ఫీజ్ కొట్టివేయడంతో ఎగిసిపడిన నిప్పురవ్వలు చేనుపై పడగా రెండెకరాల్లో పంట కాలిపోయింది. చేతికి వచ్చిన బూడిదైన నేపథ్యాన తనను ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరాడు.

● ప్రభుత్వ ప్రధానాస్పత్రి కిటకిట



ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ వద్ద క్యూ లైన్లు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రి సోమవారం కిటకిటలాడింది. సాధారణంగా ప్రతీ సోమవారం వైద్యం కోసం వచ్చేవారు ఎక్కువగా ఉంటారని.. కానీ ఈ వారం పెద్ద సంఖ్యలో వచ్చారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. సీజనల్ జ్వరాలు, కరోనా భయంతో పరీక్షలకు వచ్చిన వారితో ఆస్పత్రిలో రద్దీ నెలకొంది. ఓపీ విభాగం, రక్తపరీక్షా కేంద్రం, ఎక్స్‌రే గది, మందులు ఇచ్చే గదుల వద్ద క్యూ లైన్లలో ప్రజలు బారులుదీరారు. కాగా, ఎక్స్‌రే తీయడంలో జాప్యం జరుగుతుండడంతో చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. ఈ కారణంగా వృద్ధులు, దివ్యాంగులు అవస్థ పడడం కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



రక్తపరీక్ష కేంద్రం వద్ద..



ఎక్స్‌రే గది కోసం వేచి ఉన్న జనం

పాలేరులో కాంగ్రెస్‌దే విజయం

పోటీ చేసేది తానేనని వెల్లడించిన రాయల



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ మండలం వెంకటాపురంలో సోమవారం ఏర్పాటుచేసిన పాలేరు నియోజకవర్గ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పాలేరులో కమ్యూనిస్టులు గెలిచింది రెండు సార్లేనని, పనులపై ఎమ్మెల్యే వద్దకు వెళ్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు కూడ చేతి గుర్తుకే ఓటు వేస్తారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నుంచి ఉపేందర్ రెడ్డి టికెట్ తెచ్చుకుంటే శక్తి వంచన లేకుండా కృషి చేసి గెలిపించామని చెప్పారు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను అధికార పార్టీకి కను విప్పు కలిగించాలనే పోటీ చేసి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. పాలేరు నుంచి తాను పోటీ చేస్తున్నందున అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఏం చేశారని ఆత్మీయ సమ్మేళనాలు పెడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ముదిగొండ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్, పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, నాయకులు యడవల్లి నాగరాజు, ఇలవల పుల్లారెడ్డి, జెట్రిపోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వహణకు పొంగులేటి విరాళం

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఇటీవల ఆలయాన్ని నిర్మించడంతో పాటు బొడ్రాయి ప్రతిష్ఠించారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం రూ.50వేల నగదు అందజేశారు. సత్తుపల్లిలోని మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి ఇంట్లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కౌన్సిలర్లు మందపాటి పద్మజ్యోతిరెడ్డి, దూదిపాల రాంబాబు, సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డితో పాటు మలిరెడ్డి మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

‘డిజిటల్ గ్రీన్’ ద్వారా మిర్చి కొనుగోళ్లు

కూసుమంచి: సాగు–బాగు, డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టు ద్వారా కాల్గుడి కంపెనీ బాధ్యులు నేరుగా రైతుల నుంచి వెళ్లి మిర్చి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని గట్టుసింగారంలో రైతు పోలూరి రవి నుంచి 28 క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేయగా, కూసుమంచి ఏడీఏ విజయచంద్ర మాట్లాడారు. డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు మిర్చి సాగుపై అవగాహన కల్పించడమే పంటను నేరుగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ నెల్లూరి ఖాదర్‌బాబు, ఏఈఓ వంశీ, సంస్థ ప్రతినిధులు బాలాజీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మిర్చిని కొనుగోలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం రాపర్తినగర్‌లోని ఓ ఇంట్లో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. రాపర్తినగర్ చెందిన పాపిరెడ్డి, రజని దంపతులు తాళం వేసి స్వగ్రామమైన రాజరాంకు వెళ్లారు. వీరి కుమారుడు సూర్యతేజ మధ్యాహ్నం ఇంటికి తాళం సమీపంలోని మేనమామ ఇంటికి వెళ్లి సాయంత్రం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. దీంతో లోపల పరిశీలించగా రూ.90వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఖమ్మం టూ టౌన్ పోలీసులకు తెలపగా క్లూస్ టీమ్, సీసీఎస్ పోలీసులతో వచ్చి పరిశీలించాక కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

అక్కడికక్కడే డ్రైవర్ మృతి, ఇంకొకరికి తీవ్రగాయాలు



ఘటనాస్థలంలో పరిశీలిస్తున్న ఏసీపీ రామానుజం, సీఐ కరుణాకర్

సత్తుపల్లిటౌన్: నిద్ర మత్తు.. ఆపై మలుపు.. ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి డీసీఎం వ్యాన్ చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. సత్తుపల్లి శివారులో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమెల మండలం చెప్యాలకు చెందిన ఈడపల్లి నరేష్(32) తన స్నేహితుడు చిర్రా నరేష్‌తో కలిసి అనకాపల్లి వెళ్లాడు. అక్కడి నుంచి కరీంనగర్‌కు సెంట్రింగ్ కర్ర లోడ్‌తో డీసీఎంలో ఆదివారం రాత్రి బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయాన సత్తుపల్లి మండలం తాళ్లమడ పెద్దవంతెన సమీపాన డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లు తెలుస్తుండగా, మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో డ్రైవర్ ఈడపల్లి నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సౌజన్య ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

నేనెలా బతికానో..

మంచి నిద్రలో ఉన్న తాను ఒక్కసారిగా ఎగిరి బయటపడ్డానని వ్యాన్ డ్రైవర్ స్నేహితుడు చిర్రా నరేష్ తెలిపారు. ఇంతలోనే స్థానికులు వచ్చి అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఈప్రమాదాన్ని తలుచుకుంటేనే భయంగా ఉందని పేర్కొన్నాడు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ ఈడపల్లి నరేష్ ఇంటిపక్కనే ఉండే తాను నరేష్‌కు తోడుగా వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వాపోయాడు. కాగా, ఘటనపై సత్తుపల్లి ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు లారీలు ఢీ, డ్రైవర్ మృతి

సత్తుపల్లిటౌన్: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందగా.. మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లిలో సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని గోవిందాపూర్‌కు చెందిన జైనుల్ అబేదిన్(53) కోల్‌కత్తాలోని సొత్ కంపెనీ ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఐరన్ పైపుల లోడ్‌తో లారీలో హైదరాబాద్ బయలుదేరాడు. లారీ సత్తుపల్లి హిందూ వైకుంఠధామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. జాతీయ రహదారిపై రెండు లారీలు ఎదురెదురుగా వేగంగా ఢీకొనటంతో క్యాబిన్లు నుజ్జునుజ్జయ్యాయి. ఇందులో కోల్‌కత్తా నుంచి వస్తున్న డ్రైవర్ జైనుల్ అబేదిన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానికులు శ్రమించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మరో లారీ డ్రైవర్ కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం గండ్రాయికి చెందిన కొత్తపల్లి వెంకయ్య తలకు బలయమైన గాయాలు కావటంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స ఆనంతరం ఖమ్మం తరలించారు. జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొనడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు చేరుకొని రాకపోకలను క్రమబద్ధీకరించారు.



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

ఆకస్మాత్తుగా బాలుడు...



గౌరబోయిన జై (ఫైల్)

తిరుమలాయపాలెం: తల్లిదండ్రులతో కలిసి పొలం వద్ద ఉప్పలమ్మ తల్లి పూజకు వెళ్లి వచ్చిన మూడేళ్ల బాలుడు ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయి కన్నుమూశాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని కాకరవాయికి చెందిన గౌరబోయిన శంకర్, కవితకు కుమార్తె లక్కీ, కుమారులు వర్షిత్, జై(3) ఉన్నారు. చిన్నకుమారుడైన జైకి రెండు రోజులుగా జ్వరం వస్తున్నా తగ్గుతుందని భావించారు. ఈక్రమంలో తల్లిదండ్రులు ఆయనను తీసుకుని వ్యవసాయ క్షేత్రం వద్ద ఉప్పలమ్మ తల్లికి పాలు పొంగించేందుకు సోమవారం ఉదయం వెళ్లి మధ్యాహ్నం వచ్చారు. అంతసేపు ఆటపాటలతో సందడి చేసిన జై ఒక్కసారిగా పడిపోగా ముక్కులో నుంచి రక్తం వచ్చింది. దీంతో ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లేలోగానే ప్రాణాలు కోల్పోయాడు. పెద్ద కుమారుడు వర్షిత్ ఇటీవల గుండెజబ్బు బారిన పడడంతో చికిత్స చేయించగా.. చిన్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే, జై కూడా గుండె సంబంధిత ఇబ్బందితోనే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...



రాజాబాబు (ఫైల్)

బోనకల్: మండలంలోని కలకోట గ్రామానికి చెందిన వేము రాజాబాబు(50) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. రాజాబాబు చేపలు అమ్మేందుకు కలకోట నుండి మధిర వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో వైరా నుండి మధిర వైపు వెళ్తున్న లారీ వెనక నుండి ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వైరా నుంచి బరిలో నిలుస్తాం..

- సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు హేమంతరావు
- వైరా, మధిర, బోనకల్‌లో సాగిన ప్రజా పోరుయాత్ర

వైరా: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి సీపీఐ అభ్యర్థి పోటీలో ఉంటారని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు భాగం హేమంతరావు స్పష్టం చేశారు. సీపీఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర వైరా చేరిన సందర్భంగా సోమవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ దేశంలో మూడోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. కులం, మతం పేరుతో దేశాన్ని ముక్కలు చేయాలని యత్నిస్తుండడమే కాక రిజర్వేషన్లు తొలగించాలని చూస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేశారని మండిపడ్డారు. ఈక్రమంలో బీజేపీ విధానాలను ప్రజలకు వివరించేందుకు యాత్ర చేపట్టామని తెలిపారు. బహుముఖ పోరాటాలతో ప్రజలకు దగ్గరవుతూ భావ సారూప్యత ఉన్న పార్టీలతో కలిసి పోటీ చేస్తామని వెల్లడించారు.



మధిరలో సీపీఐ నాయకులకు జాపోరు యాత్రకు సంఘీభావం తెలిపిన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

సంపన్న వర్గాల చేతుల్లో దేశసంపద

మధిర: దేశ సంపద కొద్దిమంది సంపన్న వర్గాల చేతుల్లోనే ఉందని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజాపోరు యాత్ర మధిర మండలం మల్లవరం, మధిరల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, సీపీఎం మండల కార్యదర్శి మంద సైదులు తదితరులు సంఘీభావం తెలిపారు. అనంతరం హేమంతరావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు రూ.కోట్లలో రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చిల్లిగవ్వ కూడా ఇవ్వడకపోగా సబ్సిడీలను ఎత్తివేస్తోందని ఆరోపించారు.

తొమ్మిదేళ్ల కాలంలో చేసిందేమీ లేదు

బోనకల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనా కాలంలో పేద, మధ్యతరగతి ప్రజల కోసం చేసిందేమీ లేదని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు భాగం హేమంతరావు విమర్శించారు. బోనకల్ మండలంలోని రాపల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట, మోటమర్రి, ఆళ్లపాడు గ్రామాల మీదుగా బోనకల్‌కు ప్రజాపోరు యాత్ర చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం సంపన్నులకు కొమ్ము కాస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడేలా అన్ని సరుకుల ధరలు పెంచిందని ఆరోపించారు. కాగా, యాత్రకు సీపీఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ యాత్రలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, పోట కళావతి, తాటి వెంకటేశ్వర్లు, యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, మందడపు రాణి, బెజవాడ రవిబాబు, వూట్ల కొండలరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, మౌలానా, తోట రామాంజనేయులు, యంగల ఆనందరావు, జక్కా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీఐ గోపి బదిలీ రద్దు

ఖమ్మంక్రైం: ఖమ్మం సీసీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్న తుమ్మ గోపిని రెండు రోజుల క్రితం మెదక్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. అయితే ఆయన బదిలీని రద్దు చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి గోపిని ఖమ్మం సీసీఆర్‌బీ సీఐగా కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సినీ ఫక్కీలో చైన్ స్నాచింగ్

నేలకొండపల్లి: పట్టపగలే మహిళపై దాడి చేసిన దుండగుడు మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోటాపురంలో వృద్ధురాలు భాగం కస్తూరి బెల్ట్‌షాపు నిర్వహిస్తుండగా సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మద్యం తాగాడు. ఈ సమయాన వృద్ధురాలు ఒక్కరే ఉన్నట్లు ఆయన గుర్తించగా, పనిపై ఆమె వంట గదిలోకి వెళ్లగానే వెనుక నుంచి వచ్చి గొంతు పట్టి కింద పడేశాడు. ఆపై మరో చేతితో ముక్కుమూయగా ఊపిరి ఆడకపోవడంతో చోరీ కోసమే వచ్చినట్లు భావించిన ఆమె గొలుసు తీసుకోవాలని సైగ చేయగా మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. చాలాసేపటికి కోలుకున్న ఆమె గ్రామస్తులకు చెప్పగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో నేలకొండపల్లి ఎస్సై ప్రవంతి సిబ్బంది చేరుకుని గాలించినా ఆచూకీ తెలియరాలేదు.


సెల్‌ఫోన్ ఆర్డర్ చేస్తే సబ్బు డెలివరీ!

కారేపల్లి: ఊరూపేరు లేని సైట్లలో సరుకులు ఆర్డర్ చేస్తే మోసం జరుగుతుందనేందుకు ఇది మరో ఉదాహరణ. కారేపల్లి మండలం పేరుపల్లికి చెందిన పేరుపల్లికి చెందిన కమిడి జగన్ ఓ యాప్ ద్వారా ఈనెల12న నోకియా 2660 ఫోన్ కోసం ఆర్డర్ చేశాడు. సోమవారం డెలివరీ బాయ్ పార్సిల్ తీసుకురావడంతో రూ.1,066 చెల్లించిన జగన్ దానిని డెలివరీ బాయ్ ముందే తెరవగా రూ.10 విలువైన సబ్బు కనిపించింది. దీంతో ఖంగుతిన్న జగన్ డెలివరీ బాయ్‌ను నిలదీయడంతో డబ్బులు తిరిగి ఇచ్చేశాడు.

వ్యక్తి ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: అనారోగ్యం కారణంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం చౌడవరం గ్రామానికి చెందిన ఆళ్ల రాములు (65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భద్రాచలంలో నివాసం ఉంటున్న చిన్నకుమార్తె దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి సోమవారం ఇంటి నుంచి బయలుదేరాడు. మండలంలోని కట్టుగూడెం గ్రామం వద్ద పురుగుల మందు తాగి, కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వారు అతడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో చనిపోయాడని వారు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. ఏఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి లారీకి మంటలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల వద్ద విద్యుత్ తీగలు తెగి పత్తి లోడు లారీపై పడటంతో మంటలు అంటుకున్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసిన ఆరెంపులకు చెందిన జిన్నింగ్ మిల్లు యజమాని మిల్లుకు తరలిస్తున్నాడు. ఆరెంపుల శివారుకు రాగానే లారీపై ఉన్న పత్తి బస్తాలు విద్యుత్ తీగలకు తాకడంతో అవి తెగి పడగా మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన డ్రైవర్ లారీని పక్కకు ఆపగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.

జిన్నింగ్ మిల్లు యజమానిపై కేసు

మండలంలోని పొన్నెకల్‌లోని జిన్నింగ్ మిల్లు యజమాని గుడవర్తి రామారావుపై సోమవారం రాత్రి ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మార్కెట్ నుంచి లారీలో పత్తి తీసుకెళ్తుండగా అగ్నిప్రమాదం జరగగా.. సామర్థ్యానికి మించి పత్తి తీసుకెళ్తుండడం, ప్రమాదం జరిగితే నివారణకు మిల్లులో పరికరాలు లేవని గుర్తించి ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ అర్హత పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంగ్లిష్, హిందీ, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎ.వి.ఆర్.ఎస్.రెడ్డి తెలిపారు.

దీక్షకు అనుమతి కోసం హైకోర్టుకు వెళతాం: గట్టు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులకు మద్దతుగా తలపెట్టిన దీక్షకు అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ) సభ్యుడు గట్టు రామచంద్రరావు తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద నిరుద్యోగుల పక్షాన దీక్షను ఆపేది లేదన్నారు. సోమవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ క్రమంలో పోలీస్ శాఖను కూడా కలుస్తామన్నారు. ఈ పోరాటంలో 'టీ–సేవ్'ద్వారా అన్ని వర్గాల వారిని కలుపుకుపోతామన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షకు పోలీసులు చివరి వరకు అనుమతి పెండింగ్‌లో పెట్టి తర్వాత లేదని చెప్పారన్నారు. వైఎస్ షర్మిలకు భయపడి తమ గళాన్ని నొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఆఫీస్‌కి రావడానికి కూడా అనుమతి అంటున్నారన్నారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలోకి వెళ్తారనేది ఆయన ఇష్టమని గట్టు రామచంద్రరావు అన్నారు. ఆయన వైఎస్సార్‌టీపీలోకి రావాలనుకుంటే గేట్లు తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు.

మే 6 వరకు టీఎస్‌ఐసెట్ దరఖాస్తుకు గడువు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుము లేకుండా మే 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్‌ఐసెట్ కన్వీనర్, కాకతీయ వర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌ఐసెట్‌ను మే 26, 27 తేదీల్లో నాలుగు సెషన్‌లలో నిర్వహించనున్నారు.

లీకేజీ ఎలా చేశారు? పేపర్లు ఎవరెవరికి అమ్మారు?

టీఎస్‌పీఎస్సీ కేసులో ఈడీ ప్రశ్నల వర్షం

- ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను ఐదుగంటలకు పైగా ప్రశ్నించిన ఈడీ అధికారులు
- ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసిన నలుగురు అధికారుల బృందం
- నేడు మరోమారు ఇద్దరినీ ప్రశ్నించనున్న ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఈడీ దూకుడు పెంచింది. పేపర్ లీకేజీ నిందితులు, పేపర్లు కొనుగోలు చేసిన వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల మూలాలపై ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే సిట్ కేసు వివరాల ఆధారంగా ఈసీఐఆర్(ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేసిన ఈడీ అధికారులు విచారణ ముమ్మరం చేశారు. కేసులో ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను కోర్టు అనుమతితో సోమవారం నలుగురు సభ్యుల ఈడీ అధికారుల బృందం ప్రశ్నించింది. సోమవారం ఉదయం 11–45 గంటల సమయంలో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్లు సుమిత్ గోయల్, దేవేందర్‌సింగ్‌ల నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం చంచల్‌గూడ జైలుకు చేరుకుంది.

జైలు లోపలే వేర్వేరుగా విచారణ

జైలు లోపలే ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను వేర్వేరుగా ప్రశ్నించారు. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ దర్యాప్తులో ఇద్దరి తరఫు న్యాయవాదుల సమక్షంలోనే ఈడీ అధికారులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిల స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. తొలి రోజు విచారణలో ప్రధానంగా ఇద్దరి కుటుంబ నేపథ్యాలు, బ్యాంకు లావాదేవీలు, టీఎస్‌పీఎస్సీలో ఇతర అధికారులు, సిబ్బందితో పరిచయాలు, పేపర్ లీకేజీకి ఎలా పాల్పడ్డారు..అనంతరం ఎవరెవరితో పేపర్ విక్రయానికి సంబంధించి సంప్రదింపులు జరిపారు..అన్న అంశాలపై లోతుగా ఆరా తీసినట్టు తెలిసింది.

మధ్యవర్తులుగా ఎవరెవరున్నారు?

టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ నుంచి దొంగిలించిన పేపర్లు కొనుగోలుకు మధ్యవర్తులుగా ఎవరెవరు ఉన్నారు? వారితో ఎలా పరిచయం...? పేపర్ల కొనుగోలు చేసేందుకు ఎవరెవరు ఎలా సంప్రదించారన్న ప్రాథమిక అంశాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి ఈ కేసులో ఆర్థిక అంశాలపైనే ఈడీ ఫోకస్ పెట్టినప్పటికీ, అందుకు ఎలా మార్గాలు ఏర్పడ్డాయన్నది సైతం ఈడీ అధికారులు కూలంకషంగా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈడీ అధికారులు టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి శంకరమ్మ, మరో అధికారి సత్యనారాయణలను సైతం ఈ నెల 13న ప్రశ్నించిన విషయం తెలిసిందే. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కూడా కొన్ని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. మంగళవారం మరోమారు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

ప్రేమ పేరుతో మైనర్‌ను వేధిస్తున్నాడనే..

- నల్లగొండ జిల్లాలో యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది నిందితుల అరెస్ట్.. వారిలో ఇద్దరు మైనర్లు

నల్లగొండ క్రైం: ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న కారణంతోనే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం జి.అన్నారం గ్రామానికి చెందిన ఇరిగి నవీన్ అనే యువకుడిని బాలిక సోదరుడు తన బంధుమిత్రులతో కలసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్యలో పాల్గొన్న మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిందితులను సోమవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు కేసు వివరాలను వెల్లడించారు.

మందలించినా వినకపోవడంతో

త్రిపురారం మండలం అన్నారం గ్రామానికి చెందిన నవీన్ చదువు మధ్యలోనే ఆపేసి మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తన గ్రామానికే చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక సోదరుడు మణిదీప్ నవీన్‌ను మందలించాడు. బాలిక కూడా తనను మర్చిపోవాలని చెప్పడంతో మనస్తాపం చెంది మార్చి 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆస్పత్రిలో కోలుకున్నాక మళ్లీ బాలిక ఇంటి చుట్టూ తిరుగడం మొదలు పెట్టాడు. దీంతో బాలిక సోదరుడు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లు కలిసి ఇంటి వైపు వస్తే చంపుతామని బెదిరించారు. ఆ విషయాన్ని నవీన్ నిడమనూరు మండలం గుంటిపల్లికి చెందిన తన స్నేహితుడు ఈట అనిల్‌కుమార్‌కు చెప్పి సాయం కోరాడు. దీంతో ఈ నెల 9న అనిల్ మధ్యవర్తిగా మాట్లాడేందుకు గుంటిపల్లి గ్రామంలోని స్నేహితుడైన తిరుమల్ ఇంటి వద్దకు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లను పిలిచాడు. ఇదే అదునుగా నవీన్‌ను చంపాలనుకున్న మణిదీప్‌తో పాటు మరో 8 మంది బంధువులు మూడు బైకులపై తిరుమల్ ఇంటికి వెళ్లి కర్రలతో దాడి చేయగా ముగ్గురూ పారిపోయారు. 9 మందిలో ఒకరైన రామలింగం వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌ను 11 సార్లు పొడవగా అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు తొలుత గుంటూరుకు పారిపోయారు. అయితే చేతిలో డబ్బుల్లేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మృతుడు ఎస్సీ కావడంతో ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పంచాయతీలకు అవార్డుల పంట

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, అధికారులు అందుకున్నారు.

4 కేటగిరీల్లో నాలుగు మొదటి ర్యాంకులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ విభాగంలో నాలుగు కేటగిరీల్లో నాలుగు గ్రామాలు మొదటి ర్యాంకులు సాధించగా, రెండు గ్రామాలు రెండో ర్యాంకులను, మరో రెండు గ్రామాలు మూడో ర్యాంకులను సాధించాయి. ఐదు నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలను తెలంగాణ కైవసం చేసుకుంది. అవార్డుల కార్యక్రమం అనంతరం మంత్రి ఎర్రబెల్లి తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వల్ల జరుగుతున్న పల్లెప్రగతి కార్యక్రమం, అది సాధించిన ఫలితాలను వివరించారు. దేశంలో తెలంగాణ మాత్రమే కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు సక్రమంగా అందజేస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనా పథంలో పనిచేస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, దేశానికి ఆదర్శంగా తెలంగాణను నిలపాలని అవార్డు గ్రహీతలకు సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని మంత్రి ఎర్రబెల్లి కోరారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ :

1) **ఆరోగ్యకర పంచాయతీ:** గౌతంపూర్– 1వ ర్యాంకు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)
2) **నీరు సమృద్ధిగా ఉన్న పంచాయతీ:** నెల్లుట్ల– 1వ ర్యాంకు(జనగాం జిల్లా)
3) **సామాజిక భద్రత పంచాయతీ:** కొంగట్‌పల్లి– 1వ ర్యాంకు (మహబూబ్‌నగర్ జిల్లా)
4) **మహిళలకు స్నేహపూర్వక పంచాయతీ:** అయిపూర్–1 వ ర్యాంకు (సూర్యాపేట జిల్లా)
5) **పేదరికంలేని మెరుగైన జీవనోపాధి పంచాయతీ:** మన్‌దొడ్డి– 2వ ర్యాంక్ (జోగుళాంబ గద్వాల్ జిల్లా)
6) **సుపరిపాలన పంచాయతీ:** చీమలదారి– 2వ ర్యాంక్ (వికారాబాద్ జిల్లా)
7) **పరిశుభ్ర పంచాయతీ :** సుల్తాన్‌పూర్–3వ ర్యాంకు (పెద్దపల్లి జిల్లా)
8) **స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీ:** గంభీరావ్‌పేట– 3వ ర్యాంకు (రాజన్న సిరిసిల్ల జిల్లా)

నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తం పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం...

బెస్ట్ బ్లాక్ పంచాయతీ: తిమ్మాపూర్(ఎల్ఎండీ)– 2వ ర్యాంకు (కరీంనగర్ జిల్లా)
బెస్ట్ డిస్ట్రిక్ట్ పంచాయతీ: ములుగు– 2వ ర్యాంకు
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ముక్రా– 3వ ర్యాంకు (ఆదిలాబాద్ జిల్లా)
కార్బన్ న్యూట్రల్ ప్రత్యేక పంచాయతీ అవార్డు: కన్హా– 2వ ర్యాంకు (రంగారెడ్డి జిల్లా)
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ఎర్రవెల్లికి ప్రత్యేక ప్రశంస (సిద్దిపేట జిల్లా)

తెలంగాణ స్ఫూర్తితో దేశమంతటా పల్లెల అభివృద్ధి: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: పచ్చదనం, పరిశుభ్రత, ఇతర విభాగాల్లో తెలంగాణ పంచాయతీలు దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. పంచాయతీల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ప్రతి అంశంలోనూ అగ్రగామిగా నిలిచి, అత్యధిక అవార్డులు గెలుచుకున్న స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పల్లెల అభివృద్ధికి తమ కృషి కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లితో పాటు అవార్డులు అందుకున్న ప్రజాప్రతినిధులను, అధికారులను సీఎం అభినందించారు. 'దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామపంచాయతీలు పోటీపడితే 46 గ్రామాలు అవార్డులు దక్కించుకున్నాయి. వాటిలో 13 అవార్డులు తెలంగాణకే వచ్చినయి. అంటే ప్రకటించిన మొత్తం జాతీయ అవార్డుల్లో 30% తెలంగాణ కైవసం చేసుకున్నది. ఈ 13 ర్యాంకుల్లోనూ 4 ఫస్టు ర్యాంకులు తెలంగాణకే రావడం గొప్ప విషయం' అని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

450 కొనుగోలు కేంద్రాలే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరికోతలు మొదలై 20 రోజులు దాటినప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విషయంలో తాత్సారం కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 450 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ , కరీంనగర్ వంటి కొన్ని జిల్లాల్లోనే ఈ సెంటర్లను ప్రారంభించారు. ఖమ్మం, పెద్దపల్లి తదితర జిల్లాల్లో చాలా చోట్ల సెంటర్ల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అయితే కోతలు పెరిగి ధాన్యం పెద్ద ఎత్తున అమ్మకానికి తీసుకొచ్చే పరిస్థితి ఉన్న చోటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం: గంగుల కమలాకర్ , పౌరసరఫరాల శాఖ మంత్రి

రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కొన్ని పెద్ద గ్రామాల్లో రెండేసి కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తాం. రైతులు తమ గ్రామ పరిధిలోని కొనుగోలు కేంద్రానికే వెళ్లి పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడమే సెంటర్ల నిర్వాహకుల పని. మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదు. తరుగు, తేమ, నాణ్యత పేరుతో మిల్లర్లు రైతులను వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

స్ట్రాంగ్‌రూమ్ తాళంచెవుల మాయంపై ఆరా

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓ స్ట్రాంగ్ రూమ్ తాళం చెవుల మాయంపై ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు విచారణ చేపట్టారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఎన్నికల సామగ్రిని ఎలా భద్రపర్చారు.. తాళంచెవులు ఎలా తప్పిపోయాయి.. అనే దానిపైనే సుదీర్ఘంగా విచారణ జరిపినట్లు తెలిసింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించడంతో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 17ఏ, 17సీ డాక్యుమెంట్ కాపీలు, సీసీ పుటేజీలు, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను ఈ నెల 11న తమకు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే, మొత్తం మూడు స్ట్రాంగ్‌రూమ్‌లకుగాను రెండు తెరుచుకున్నాయి. కోర్టు అడిగిన 17ఏ, 17సీ వీడియో పుటేజీలు భద్రపర్చిన మూడోగది తాళంచెవులు లేవు. ఈ విషయంపై కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ఈ నెల 12న మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాళంచెవులు మాయం కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశించింది.

జిల్లా వార్తలు

క్రీడలతో మానసిక ఉల్లాసం


ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులు, నిర్వాహకులతో సీఐ వసంతకుమార్

జూలూరుపాడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్ అన్నారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ ఆధ్వర్యాన జూలూరుపాడులో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువకుల్లో ఐకమత్యాన్ని పెంపొందించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న జేఎన్‌టీయూహెచ్ జేఏసీని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. జేఎన్‌టీయూహెచ్ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మందా రంజిత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సందీప్‌తో పాటు జి.సురేష్ యాదవ్, పి.రమేష్, సునీల్‌కుమార్, రమేష్, మోదుగు రామకృష్ణ, పడిగల రవి, దినేష్, సాయి వంశీ, నరేష్, రవి, మౌళి, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీమలపాడు బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఈనెల 12న గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్ర గాయాల పాలై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, రాష్ట్ర ఇన్‌కంటాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ సోమవారం పరామర్శించారు. తవసిబోడుకు చెందిన తేజావత్ భాస్కర్, వెంకటియా తండాకు చెందిన ఆంగోతు కుమార్‌ను పరామర్శించిన వారు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప, వైద్యులను కోరారు.

ఖమ్మం-కురవి హైవే అభివృద్ధికి నిధులు

- రూ.124.80 కోట్లు మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం
- పెద్దతండా – పల్లెగూడెం వరకు నాలుగు లేన్లుగా రహదారి
- వెల్లడించిన బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నాగేశ్వరరావు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రహదారి పనులపై చర్చిస్తున్న ఎంపీ నామా (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం – కురవి జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 365 ఏ) అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జాతీయ రహదారిలో పలు చోట్ల నాలుగు లేన్లు వెడల్పు, అభివృద్ధి, డివైడర్ల, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం కేంద్రం రూ.124.80 కోట్లు విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈవిషయాన్ని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం వెల్లడించారు. కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమై, లేఖలు అందించిన నేపథ్యాన కేంద్రం జాతీయ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందని ఆయన తెలిపారు.

రెండు ప్యాకేజీల్లో పనులు

ఖమ్మం–కురవి జాతీయ రహదారిలో పెద్ద తండా జంక్షన్ నుంచి పల్లెగూడెం వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా విస్తరించడంతో పాటు డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే పల్లెగూడెం నుంచి ఎం.వెంకటాయపాలెం వరకు రోడ్డు విస్తరణ, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టనున్నారని ఎంపీ నామా పేర్కొన్నారు. మొదటి ప్యాకేజీ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.57.52 కోట్లకు పరిపాలనాపరమైన అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. ఇదే జాతీయ రహదారికి సంబంధించి మరో రెండు చోట్ల పనులకు కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పారు. రెండో ప్యాకేజీలో వెంకటగిరి క్రాస్ నుంచి కోదాడ క్రాస్ వరకు, ఏదులాపురం జంక్షన్ నుంచి పెద్ద తండా జంక్షన్ వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడమే కాక డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.67.28 కోట్లు మంజూరయ్యాయని ఎంపీ వివరించారు.

కేంద్రమంత్రితో పలుమార్లు భేటీ

జాతీయ రహదారి వెంట గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం తాను పలుమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాటు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతో సమావేశమై లేఖలు ఇచ్చానని ఎంపీ నామా తెలిపారు. దీంతో నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో పనులు పూర్తయితే రహదారి వెంట గ్రామాలు, ప్రాంతాలు అభివృద్ధిని సాధిస్తాయని వివరించారు. అంతేకాక రవాణాపరంగా ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఎంపీ ఈ సందర్భంగా తెలిపారు.

నిర్దిష్టమైన ప్రణాళికతోనే మెరుగైన ఫలితాలు

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి




వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

మణుగూరుటౌన్: అధికారులు నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించి సమష్టి కృషితో ముందుకు సాగితే లక్ష్యం మేరకు బొగ్గు, ఉత్పత్తి, రవాణా సాధ్యమవుతుందని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన ఆయన పీకే ఓసీ–2, పీకేఓసీ–4, కేపీయూజీ, మణుగూరు ఓపెన్‌కాస్టు గనులను సందర్శించారు. అక్కడ బొగ్గు ఉత్పత్తి, లోడింగ్‌ను పరిశీలించాక అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 119.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి సమష్టి కృషితో కృషి చేయాలని సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయి వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓలు జి.నాగేశ్వరరావు, శ్రీనివాసాచారి, అధికారులు ఎం.నర్సిరెడ్డి, రాముడు, సురేష్, రాంబాబు, శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ దరఖాస్తులు దర్బార్‌లో ఇవ్వొద్దు

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీడీ, ఏపీఓ జనరల్

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగాల కోసం నిరుద్యోగులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలే తప్ప దర్బార్‌లో ఇవ్వొద్దని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. ఐటీడీఏలో సోమవారం ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్‌లో ఆయన డీడీ రమాదేవితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ గిరిజనులు జీవనోపాధి, ఇతర సమస్యలపై మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఉద్యోగాల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, పరీక్షల ద్వారా నియామకాలు ఉంటాయని చెప్పారు. కాగా, అర్హులైన ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎస్‌ఓ సురేష్‌బాబు, డీఎస్‌ఓ ప్రభాకర్‌రావుతో పాటు అధికారులు మునీర్ పాషా, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో లాజిస్టిక్ ఏజెంట్ల నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కమీషన్ పద్ధతిపై పలువురు ఏజెంట్లు లాజిస్టిక్ కౌంటర్లు నిర్వహిస్తుండగా, మరికొందరిని నియమించనున్నట్లు ఖమ్మం, వరంగల్ జిల్లాల బాధ్యులు ఎం.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెంలోని ప్రధాన కూడళ్లతోపాటు అన్ని మండల కేంద్రాల్లో కమీషన్ పద్ధతిపై లాజిస్టిక్ సర్వీస్‌ను ప్రైవేట్ ఏజెంట్లకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా వ్యాపారం ఉండి, కంప్యూటర్, టిమ్ మిషన్ కలిగిన వారు లాజిస్టిక్ సెంటర్ ఏర్పాటుచేయొచ్చని, పార్సిల్ బుకింగ్‌పై 12శాతం కమీషన్ లభిస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వివరాల కోసం 91542 88582, 81254 58546 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రామాలయంలో అంతర్గత బదిలీలు

శాఖల మార్పుతో ప్రక్షాళనపై ఈఓ దృష్టి



రామాలయం వ్యూ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేశారు. ఈ వివరాలను ఈఓ రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏఈఓ–1 శ్రవణ్‌కుమార్‌కు భూములు, దుకాణాలు, అద్దె, రికార్డు గది, ప్రధాన ఉత్సవాలు, శ్రీరామదీక్ష, ప్రచార రథం, శాశ్వత అన్నదానం, శాశ్వత పూజలు, ట్రస్ట్‌బోర్డు, ఆడిట్ తదితర విభాగాలను అప్పగించారు. అలాగే, ఏఈఓ–2 భవానీ రామకృష్ణకు ఎస్టాబ్లిష్‌మెంట్, సీఆర్‌ఓ, కౌంటర్ల పరిశీలన, దేవస్థానం, వీఐపీల ప్రొటోకాల్, గోశాల, అన్నదానం, కల్యాణకట్ట, ప్రచార శాఖ, ప్రసాదం తయారీ, పర్ణశాల తదితర శాఖలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక సూపరింటెండెంట్ నిరంజన్‌కు ప్రొవిజన్ స్టోర్, ప్రసాదం తయారీ, అన్నదానం, కల్యాణకట్ట, సీఆర్‌ఓ, లడ్డూ కౌంటర్లు, స్టాక్, టికెట్ కౌంటర్ల పరిశీలన, మరో సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాస్‌కు ఎస్టాబ్లిస్‌మెంట్, వేతనాలు, భూములు, అద్దె, లైసెన్సు తదితర విభాగాలు, ఇంకో సూపరింటెండెంట్ లింగాల సాయిబాబుకు దేవస్థానం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తూనే వీఐపీల ప్రొటోకాల్, పాత, కొత్త గోశాల, ప్రచార శాఖ పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించారు. మరో సూపరింటెండెంట్ కిషోర్‌కు ఆడిట్, రికార్డులు, శాశ్వత అన్నదానం, శాశ్వత పూజలతో పాటుగా శని, ఆదివారాలలో పర్ణశాల దేవస్థానంలో విధులు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, విధుల్లో చేరిన కొద్ది కాలంలో ఈఓ రమాదేవి పలువురు అధికారులు, ఉద్యోగుల శాఖల మార్పు చేయడం ద్వారా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లయింది.

తనిఖీలకు కమిటీలు ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలోని వివిధ విభాగాల స్టోర్స్‌ల్లో తనిఖీ చేసేందుకు కమిటీలు ఏర్పాటుచేసినట్లు ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించిన స్టాక్, రిజిస్టర్లను ఆయా కమిటీలు తనిఖీ చేస్తూ అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. కాగా, కమిటీల పనితీరుపై సీసీ ఎం.అనిల్‌కుమార్ పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని ఈఓ ఆదేశించారు

ఉమ్మడి ఖమ్మంపై బీజేపీ ప్రత్యేక దృష్టి

మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని మాజీ ఎమ్మెల్సీ గరికపాటి మోహన్‌రావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలతో ఒక పార్లమెంట్ స్థానంలో పార్టీని బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో విజయం సాధించేలా దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. త్వరలోనే ఈ జిల్లాలో వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరనున్నారని తెలిపారు. ఈమేరకు సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తున్నందున ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కోనేరు సత్యనారాయణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రమేష్, నున్న రవికుమార్, శ్యాం రాథోడ్, ఉప్పల శారద, వాసుదేవరావు, విజయరెడ్డి, దీకొండ శ్యాం తదితరులు పాల్గొన్నారు.

24నుంచి కేయూ ఐదేళ్ల లా సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల లా కోర్సు మొదటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఈ వివరాలను నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక సోమవారం తెలిపారు. ఐదేళ్ల లా కోర్సు తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24, 27, మే 1, 4, 8వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. అలాగే, మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 29, మే 2వ తేదీల్లో, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 28, మే 1, 3వ తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇక ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, మే 3, 6, 10వ తేదీల్లో, ఏడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 28, మే 2, 5, 9వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు.